సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



ఉప్పొంగిన భక్తిభావం

చర్ల, కరకగూడెం, దుమ్ముగూడెం మండలాల్లో కొనసాగుతున్న సమ్మక్క – సారలమ్మ జాతరలో భక్తి భావం ఉప్పొంగింది. 8లో



రోడ్డెక్కిన అన్నదాతలు

బోనకల్ బ్రాంచ్ కెనాల్ చివరి ఆయకట్టుకు నీరందక పంటలు ఎండిపోతున్నాయంటూ రైతులు ఆందోళన నిర్వహించారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
34° / 18°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి వేళ చలి కూడా తక్కువగానే నమోదవుతుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, రామాలయంలో శుక్రవారం నుంచి సహస్ర కలశాభిషేకోత్సవాలు జరుగనున్నందున మూడు రోజుల పాటు నిత్యకల్యాణాలు రద్దు చేశారు.

విష్ణు సహస్రనామ పారాయణం



పారాయణం చేస్తున్న భక్తులు

శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఏలూరు జిల్లా మడిచర్ల గ్రామానికి చెందిన భక్తులు గురువారం విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాఘ శుక్ల ద్వాదశి రోజున తమ గ్రామంలో విష్ణుసహస్రనామ పారాయణ యజ్ఞం చేపట్టి పూర్తి చేశామని, ఇందులో భాగంగా రామయ్య సన్నిధిలో విష్ణు సహస్రనామ పారాయణం చేశామని చెప్పారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్ శర్మ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శిరీష

చుంచుపల్లి: వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో పని చేస్తున్న సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌ఓ జేవీఎల్ శిరీష సూచించారు. గురువారం తన కార్యాలయంలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రులకు వచ్చేవారు ఇబ్బంది పడకుండా సకాలంలో వైద్య సేవలందించాలని ఆదేశించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఏడీ మోహన్, సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

‘సీతారామ’కు నిధులు పెంచేనా..





రూ.2,300 కోట్లతో సమగ్ర ప్రణాళిక

- బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై ఉత్కంఠ
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- సమస్యలపై గళం విప్పనున్న ఎమ్మెల్యేలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 6.40 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో సీతారామ ప్రాజెక్టు పనులు చేపట్టారు. ఇప్పటికే గోదావరిపై బ్యారేజీ, కరకట్ట నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. అయితే కిన్నెరసాని అభయారణ్యం కారణంగా ఇల్లెందు నియోజకవర్గానికి గోదావరి నీరు అందించే విషయంలో డిజైన్ మార్చాల్సి వచ్చింది. ఇప్పటికే రూ.8 కోట్లతో దీనికి సంబంధించిన సర్వే చేశారు. మార్చిన డిజైన్‌తో ఇల్లెందు నియోజకవర్గంతో పాటు రఘునాథపాలెం మండల పరిధిలో మొత్తం 1.30 లక్షల ఎకరాలకు సాగు నీరు అందనుంది. దీనికి సంబంధించిన కాల్వలు, రిజర్వాయర్లు, పంపుహౌస్‌ల నిర్మాణాల కోసం రూ. 2,300 కోట్లతో సమగ్ర ప్రణాళిక సిద్ధం చేశారు. మార్చిన డిజైన్‌కు ఈ బడ్జెట్‌లో ఏ మేరకు నిధుల కేటాయింపులు ఉంటాయనేది ఆసక్తిగా మారింది. కాగా, నేటి నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం అవుతుండడంతో తమ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను అసెంబ్లీలో వినిపించేందుకు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నారు. పోడు భూములకు పట్టాల జారీ, విద్య, వైద్యం, సాగునీటి రంగాలతో పాటు పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ఎమ్మెల్యేలు ఫోకస్ చేయనున్నారు.



ములకలపల్లి మండలం వీకే రామవరంలో ట్రయల్ రన్‌కు సిద్ధమైన సీతారామ పంప్‌హౌస్

వంద పడకల ఆస్పత్రి కావాలని కోరుతా



– హరిప్రియా నాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే

ఇటీవల తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోకి మారిన తర్వాత ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలు మెరుగయ్యాయి. రోజుకు 800 వరకు ఓపీ నమోదవుతోంది. ప్రస్తుతం 30 పడకల సామర్థ్యం గల ఈ ఆస్పత్రిని వంద పడకలకు పెంచాలని అసెంబ్లీ సమావేశాల్లో కోరుతా. కాకతీయుల కాలంలో నిర్మించిన బయ్యారం పెద్ద చెరువు మట్టి కాల్వల కింద 12 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ 6 కి.మీ పొడవైన కాల్వలను ఆధునీకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తా. ఇల్లెందుకు రెవెన్యూ డివిజన్ హోదాతో పాటు కొత్తగా కొమరారం, బోడు మండలాలు ఏర్పాటు అంశాన్ని ప్రస్తావిస్తా. ఏజెన్సీ నియోజకవర్గమైన ఇల్లెందులో ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి టెక్నికల్ కోర్సులు అందించే కాలేజీ మంజూరు చేయాల్సిందిగా విన్నవిస్తాను.

రెగ్యులరైజేషన్‌పై ప్రస్తావిస్తా



– వనమా వెంకటేశ్వరరావు, కొత్తగూడెం, ఎమ్మెల్యే

కొత్తగూడెంలో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం జీవో నంబర్ 76 తీసుకొచ్చాం. ఇప్పుడు పాల్వంచలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సర్వే నంబరు 817లో ఉన్న భూములకు రెగ్యులరైజేషన్ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తాను. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు మున్సిపాలిటీల తరహాలో ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతా. కొత్తగూడెం బైపాస్ రోడ్ నిర్మాణానికి నిధుల కోసం ప్రయత్నం చేస్తా.

మున్సిపాలిటీ హోదా కావాలని అడుగుతా




– మెచ్చా నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే

అశ్వారావుపేటను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని అసెంబ్లీ సమావేశాల వేదికగా ప్రభుత్వాన్ని కోరుతా. అదే విధంగా పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు అంశాన్ని ప్రస్తావిస్తాను. ఏజెన్సీ మండలాల అభివృద్ధికి ప్రత్యేక నిధుల మంజూరు చేసేలా ప్రయత్నిస్తాను.

కీలకం కానున్న ‘పోడు’

జిల్లాలో పోడు సమస్య తీవ్రంగా ఉంది. 2.97 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలంటూ 83 వేల మందికి పైగా రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ఈ సమస్యపై అనేక సార్లు అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. ఈ నెలలోనే పోడు పట్టాల జారీ ప్రక్రియ మొదలవుతుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రకటించారు. అయితే సమస్య తీవ్రత దృష్ట్యా ఈ సమావేశాల్లోనూ పోడు అంశం కీలకం కానుంది.

ఒకటా.. మూడా..?



భద్రాచలం పట్టణ వ్యూ

- భద్రాచలం పంచాయతీపై సందిగ్ధత వీడేనా..
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- ప్రభుత్వ నిర్ణయం కోసం స్థానికుల ఎదురుచూపులు
- పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్

భద్రాచలం: రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో భద్రాచలం గ్రామపంచాయతీ అంశం మరోమారు చర్చలోకి వచ్చింది. భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీగా కొనసాగుతుందా లేక ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 45 ప్రకారం మూడు పంచాయతీలుగా విడిపోతుందా అనే దానిపై ఈ సమావేశాల్లో సందిగ్ధత వీడే అవకాశాలు ఉన్నాయి.

భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీకి 2013లో చివరిసారిగా ఎన్నికలు జరిగాయి. ఆ పాలకవర్గం గడువు 2018 ఆగస్టులో ముగిసింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం భద్రాచలం, సారపాకను మున్సిపాలిటీలుగా ప్రకటించింది. అయితే భద్రాచలం మున్సిపాలిటీగా ఉండటానికి గిరిజన చట్టాలు ఒప్పుకోవని, గ్రామపంచాయతీగానే కొనసాగించి ఎన్నికలు జరపాలని స్థానిక ఆదివాసీ సంఘ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో అప్పటి నుంచి పాలకవర్గం లేకుండా అధికారుల ఆధ్వర్యంలోనే పాలన సాగుతోంది. కాగా, భద్రాచలం మున్సిపాలిటీనా, గ్రామ పంచాయతీనా తేల్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు అల్టిమేటం జారీ చేసింది. ఈ నేపథ్యంలో భద్రాచలాన్ని భద్రాచలం, సీతారాంనగర్, శాంతినగర్ పంచాయితీలుగా, సారపాకను సారపాక, ఐటీసీ పంచాయతీలుగా విభజిస్తూ ప్రభుత్వం జీఓ 45 ద్వారా ఉత్తర్వులు విడుదల చేసింది. భద్రాచలంలో 21 వార్డులు, సీతారాంనగర్‌లో 17 వార్డులు, శాంతి నగర్‌లో 17 వార్డులు, సారపాకలో 17 వార్డులు, ఐటీసీ గ్రామ పంచాయతీలో 15 వార్డులుగా ఏర్పాటు చేస్తామని, ఈ మేరకు అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేసి, ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది.

మరోసారి తెరపైకి..

రాష్ట్ర అసెంబ్లీ శీతాకాల సమాశాలు శుక్రవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో భద్రాచలం, సారపాక గ్రామపంచాయతీల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. భద్రాచలాన్ని మూడు పంచాయతీలుగా విభజిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్‌ఎస్‌తో పాటు కొన్ని ఆదివాసీ సంఘాలు మినహా.. మిగిలిన అన్ని ప్రధాన పార్టీలు, పలు సంఘాలు, స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆధ్వర్యంలో పలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. ప్రజల వ్యతిరేకతతో ప్రభుత్వం జీఓ 45ను ఉపసంహరించుకుంటుందని ప్రచారం జరిగినా.. సర్కారు ఆ దిశగా ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. అయితే నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అవుతుండడంతో ఈ అంశంపై మళ్లీ చర్చ జరుగుతోంది.

అసెంబ్లీలో ప్రస్తావిస్తా



శుక్రవారం నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో భద్రాచలం గ్రామపంచాయతీ సమస్యను ప్రస్తావిస్తా. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న జీఓ 45కు వ్యతిరేకంగా, భద్రాచలాన్ని మేజర్ గ్రామపంచాయతీగానే కొనసాగించాలని అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టాం. ఇప్పటికే భద్రాచలానికి జరిగిన అన్యాయంపై ఇక్కడి ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. మళ్లీ అన్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదు.

– పొదెం వీరయ్య, ఎమ్మెల్యే

‘ఓపెన్’ ఫీజు గడువు ఈనెల 10..

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2022 – 23 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ఏప్రిల్, మే నెలల్లో జరుగుతాయని, ఇందుకు ఈనెల 10లోగా ఫీజు చెల్లించాలని డీఈఓ ఎన్.ఎస్.ఎస్.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి అభ్యర్థులు థియరీ సబ్జెక్టుకు రూ.100, ప్రాక్టికల్ సబ్జెక్టుకు రూ.100 చొప్పున, ఇంటర్ అభ్యర్థులు థియరీ సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్ సబ్జెక్టుకు రూ.150 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రూ. 25 ఫైన్‌తో ఈనెల 16 వరకు, రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 22 వరకు అవకాశం ఉందని, మీ సేవ లేదా ఆన్‌లైన్‌లో చలనా, డీడీ రూపంలో చెల్లించవచ్చని వివరించారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పొందడానికి ప్రజలు ఆధార్‌కార్డును తప్పక అప్‌డేట్ చేసుకోవాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఐడీఓసీ కార్యాలయంలో గురువారం ఆధార్ అప్‌డేట్ ప్రక్రియపై జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆధార్ ఆధారంగానే సేవలు కొనసాగుతాయన్నారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో రానున్న నెల రోజుల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆరేళ్ల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆధార్ జనరేట్ చేయాలని చెప్పారు. ఐడీఓసీ కార్యాలయంలోనూ ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డీఆర్‌ఓకు సూచించారు. ప్రతి పదేళ్లకు ఒకసారి ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో 40 వేల మంది చిన్నారులకు ఆధార్ నమోదుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సంక్షేమాధికారికి సూచించారు. ఆధార్‌కార్డు లేని విద్యార్థులు జిల్లాలో 1852 మంది ఉన్నారని, వారి నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీపీఓ రమాకాంత్, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఎంహెచ్‌ఓ శిరీష, సంక్షేమాధికారి లెనీనా, డీఈఓ ప్రసాద్, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, అదనపు ఎస్పీ నందిరామ్, ఏఓ గన్యా, పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్. సంతోష్, ఈడీఎం విజయసారథి, యూఐడీఏఐ ప్రాజెక్టు మేనేజర్ అనీల్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ వినయ్, మీసేవ జిల్లా మేనేజర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆధార్ ప్రాముఖ్యతను తెలిపే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

క్రీడాప్రాంగణాల ఏర్పాటులో ప్రగతి సాధించాలి

రానున్న రెండు వారాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో రాపిడ్ ప్రోగ్రెస్ రావాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. గురువారం ఆయన ఐడీఓసీలో పల్లె ప్రగతి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా క్రీడా ప్రాంగణాల ఏర్పాటు ప్రక్రియను సమీక్షించారు. జిల్లాలో 800 పైగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాల్సి ఉందని, పర్యవేక్షణకు జెడ్పీ సీఈఓను ప్రత్యేకాధికారిగా నియమించామని చెప్పారు.

జిల్లా జడ్జిని కలిసిన డీఎస్పీలు



జడ్జికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ రహమాన్

కొత్తగూడెంటౌన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్‌ను కొత్తగూడెం, పాల్వంచ డీఎస్పీలు షేక్ అబ్దుల్ రహమాన్, ఎన్. వెంకటేశ్వర్లు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరూ డీఎస్పీలు జడ్జికి పుష్పగుచ్చాలు అందించారు.

పక్కాగా పంటల సర్వే

జిల్లా వ్యవసాయశాఖ అధికారి అభిమన్యుడు

కరకగూడెం: జిల్లాలో పంటల సర్వే ప్రక్రియ పక్కాగా సాగుతోందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కొర్స అభిమన్యుడు తెలిపారు. మండలంలోని బుద్దారంలో రైతులు సాగుచేస్తున్న పలు పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అవసరాల దృష్ట్యా రైతులు సాగులో విభిన్న మార్పులకు శ్రీకారం చుట్టాలని సూచించారు. చిరుధాన్యాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయలతో పాటు పామాయిల్ వంటివి సాగు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే నంబర్, సాగు విస్తీర్ణం, పంట, విత్తనరకం, ప్రధాన పంట అంతరపంట, నీటి వసతి తదితర వివరాలను నమోదు చేయాలని ఏఈఓలను ఆదేశించారు. పంటల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ చటర్జీ, ఏఈఓలు ప్రశాంత్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న అభిమన్యుడు

పచ్చదనంతో పరిఢవిల్లాలి

- ముఖ్యమంత్రి ఆకాంక్షను నెరవేర్చాలి
- హార్టికల్చర్ ఏడీ కిషన్‌రావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ‘తెలంగాణలో అడవులు ఉండడం కాదు.. అడవుల్లోనే తెలంగాణ ఉండాలి’ అన్న సీఎం కేసీఆర్ సూచన మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనం పరిఢవిల్లేలా చర్యలు చేపట్టినట్లు ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కిషన్ రావు తెలిపారు. గురువారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లో గార్డెన్, లాన్, మొక్కలు, పచ్చదనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గార్డెన్, అర్బన్ ఫార్మింగ్ ఫెస్టివల్ – 2023 నిర్వహిస్తున్నామని, ఈ క్రమంలో రాష్ట్రంలోని అన్ని ఐడీఓసీ కార్యాలయాల్లో పచ్చదనం పెంపకానికి చేపట్టిన చర్యలను కేవీ ప్రవీణ్‌కుమార్, యూసఫ్‌ల బృందం పరిశీలిస్తోందని తెలిపారు. ఇప్పటి వరకు ఖమ్మం, మహబూబాబాద్, వనపర్తి, మహబూబ్‌నగర్ ఐడీఓసీల్లో పచ్చదనం పెంపకానికి చేపట్టిన చర్యలను పరిశీలించినట్లు తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరుకు రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న ఫెస్టివల్‌కు ఐడీఓసీల్లో పచ్చదనం పెంపకానికి చేపట్టిన చర్యలను ప్రామాణికంగా తీసుకుని రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసిన ఉత్తమ కార్యాలయాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. సిబ్బంది విధుల నిర్వహణకు ఆహ్లాదకరమైన వాతావరణం కావాలంటే పచ్చని చెట్లు ఉండాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పెద్దయెత్తున పచ్చదనం పెంపునకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వైద్య కళాశాలలు, యూనివర్సిటీల్లోనూ మొక్కలు పెంచుతున్నట్లు చెప్పారు. గతంలో ఉద్యాన శాఖ ద్వారా కూరగాయలు, పండ్ల చెట్లను మాత్రమే సాగు చేసేవారని, ఇప్పుడు అడవుల పెంపకానికి సైతం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఐడీఓసీలో పచ్చదనం పెంపునకు కలెక్టర్ అనుదీప్ ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టారని అభినందించారు. పాల్వంచ ఎస్‌ఐ రామారావు 11 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న చెప్పగా.. ఎస్సైని అభినందించారు. కార్యక్రమంలో ఉద్యాన సిబ్బంది కిరణ్‌కుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఐడీఓసీలో పరిశీలిస్తున్న కిషన్‌రావు, మరియన్న తదితరులు

మిద్దె తోటలను పెంచాలి

భద్రాచలంటౌన్: ఇంటి ముందు ఖాళీ స్థలం లేకున్నా ప్రతి కుటుంబం మిద్దె తోటల పెంపకంపై దృష్టి సారిస్తే ఆరోగ్యంతో పాటు పచ్చదనం అభివృద్ధి చెందుతుందని కిషన్‌రావు అన్నారు. పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీలో మాధవరావు – దివ్య దంపతులు పెంచుతున్న మిద్దె తోటను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానికంగా లభించే అరుదైన మొక్కలతో పాటు వివిధ నర్సరీలు, ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసి పచ్చదనంతో పాటు ఆరోగ్యానికి ఉపయోగపడే సేంద్రియ పంటలు, కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచడం అభినందనీయమని అన్నారు. మొక్కలకు తెగుళ్లు సోకకుండా పుల్లటి మజ్జిగ, నీమ్ ఆయిల్ పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీహెచ్‌ఎస్‌ఓ సముద్రాల విజయకుమార్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రామయ్య హుండీ ఆదాయం రూ.2.20 కోట్లు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గురువారం హుండీలను లెక్కించారు. 84 రోజులకు గాను రూ. 2,20,91,906 ఆదాయం సమకూరింది. దీంతోపాటు 250 గ్రాముల బంగారం, రెండు కేజీల వెండి వస్తువులను భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. ఇంకా 499 యూఎస్ డాలర్లు, 55 కెనడా డాలర్లు, 85 సింగపూర్ డాలర్లు, 180 ఆస్ట్రేలియా డాలర్లు, 200 ఒమన్ బైసాలతో పాటు ఇతర విదేశీ మారక ద్రవ్యాన్ని సైతం భక్తులు స్వామివారికి సమర్పించారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఆలస్యమైన హుండీల లెక్కింపు ముక్కోటి ఉత్సవాల అనంతరం చేపట్టడంతో భారీగా ఆదాయం సమకూరింది. అనంతరం హుండీ ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శివాజీ తదితరులు పాల్గొన్నారు.



హుండీ కానుకలు లెక్కిస్తున్న భక్తులు, ఆలయ సిబ్బంది

క్లుప్తంగా

ఘనంగా బాలాజీ సత్సంగ వార్షికోత్సవం



స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో బాలాజీ సత్సంగం 21వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పురవీధుల్లో సభ్యులు నగర సంకీర్తన జరిపారు. స్వామి వారికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు ప్రసాదాచార్యులు వైభవంగా జరిపించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సద్గురు ఫౌండేషన్ వ్యవస్థాపకులు చేసిన గాజర్ల వీరభద్రం ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భారత లాలమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్, ఉమామహేశ్వరరావు, బాలాజీ సత్సంగ సభ్యులు సీతయ్య, దారా శ్రీను, సైదులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో గురువారం 20 కిలోల గంజాయి పట్టుబడింది. ఎక్సైజ్ అధికారుల కథనం ప్రకారం.. భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద ఎక్సైజ్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ వాహనంలో 20 కేజీల గంజాయి తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారయ్యారు. ఈ దాడిలో పి.సామ్యూల్ జాన్సీ, ఎస్కే ముబషీర్ అహ్మద్, ఎస్సై ఎంఏ కరీం, జి.బాలు, హెచ్‌సీలు కె.సుధీర్, పి.హరీష్, టి.వెంకట్, ఇసిలు ఎ.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో దీపం అంటుకుని మహిళ మృతి

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రదక్షిణ చేస్తుండగా భక్తులు వెలిగించిన దీపం చీరకు అంటుకుని ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భద్రాచలం పట్టణంలోని సీతారాం నగర్ కాలనీకి చెందిన ఓ వృద్ధురాలు ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా గత నెల 7న వెంకటేశ్వర స్వామి ఆలయం వద్దకు వెళ్లి ప్రదక్షిణ చేస్తుండగా దీపం అంటుకొని ఒళ్లంతా కాలిపోగా, చికిత్స నిమిత్తం హైదరాబాద్ తీసుకెళ్లారు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గత నెల 31న మృతి చెందింది. ఆలయంలో నిర్వహణ బాధ్యతలు చూసేవారు లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,881

ఫైనల్స్‌లో కేఎండీసీ, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్

- తుది దశకు చేరిన 'సాక్షి'ప్రీమియర్ లీగ్
- ఉత్కంఠగా సాగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లు



ఫైనల్స్‌కు చేరిన ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల జట్టు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న 'సాక్షి' బ్యూరో ఇన్‌చార్జి బొల్లం శ్రీనివాస్, బీఎం మోహన్‌కృష్ణ, టీవీ ప్రతినిధి మహేందర్‌కుమార్

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఖమ్మం స్పోర్ట్స్: 'సాక్షి 'మీడియా గ్రూప్ ఆధ్వర్యాన సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్ సౌజన్యంతో జరుగుతున్న 'సాక్షి'ప్రీమియర్ లీగ్(ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు తుది అంకానికి చేరాయి. ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో పోటీలు జరుగుతుండగా, గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్, సెమీస్ మ్యాచ్‌లను 'సాక్షి'బ్రాంచ్ మేనేజర్ గుడిమెట్ల మోహనకృష్ణ, బ్యూరో ఇన్‌చార్జ్ బొల్లం శ్రీనివాస్, టీవీ ప్రతినిధి పి.మహేందర్ ప్రారంభించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఈవెంట్ మేనేజర్ బోడపట్ల వేణు, ఆర్సీ ఇన్‌చార్జి నెల్లూరి ఉపేందర్, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల పీడీ డాక్టర్ బి.వెంకన్నతో పాటు జుజ్జూరు ఉపేందర్, గుడిసె రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఈమేరకు సీనియర్స్ విభాగంలో సెమీస్‌లో గెలుపొందిన కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల, ఎస్ఆర్అండ్‌బీజీఎస్ జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఇక జూనియర్స్ విభాగంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాల(ఖమ్మం) – బొమ్మ డిప్లొమా కళాశాల(ఖమ్మం) జట్లు ఇప్పటికే ఫైనల్స్‌కు చేరగా... రెండు విభాగాల్లో ఫైనల్స్ పోటీలను శుక్రవారం నిర్వహించనున్నారు.

సెమీ ఫైనల్స్‌లో...

- మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాల(ఖమ్మం) – మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల(సత్తుపల్లి) జట్లు తలపడగా బ్యాటింగ్ ఎంచుకున్న మదర్‌థెరిస్సా జట్టు 74 పరుగులు చేయగా, ఈ జట్టులో శివ 29 పరుగులు సాధించాడు. ఆతర్వాత బ్యాటింగ్‌కు దిగిన కవిత కాలేజీ జట్టు 77 పరుగులు చేయడంతో విజయం సాధించి ఫైనల్స్‌లోకి దూసుకెళ్లింది. ఈ జట్టులో నాగూల్ మీరా ఒక ఫోర్, ఒక సిక్సర్ సాయంతో 23 పరుగులు, దేవాన్ 12, ఫరీద్ 12 పరుగులు చేశారు.

● రెండో సెమీస్‌లో...

SPL SAKSHI PREMIER LEAGUE

ఎస్‌బీఐటీ-1(ఖమ్మం) – ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల(ఖమ్మం) జట్లు తలపడగా తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్‌బీఐటీ జట్టు పరిమిత ఓవర్లలో 69 పరుగులు చేసింది. ఈ జట్టులో హర్ష 18, కల్యాణ్ 12 పరుగులు చేశారు. ఆతర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ జట్టు 70 పరుగులు సునాయాసంగా చేసి ఫైనల్స్‌కు చేరింది. ఈ జట్టులో బన్నీ మూడు ఫోర్లు ఒక సిక్సర్‌తో 28, విశాల్ రెండు సిక్స్‌లు కలిపి 15 పరుగులు చేశారు.

క్వార్టర్ ఫైనల్స్ ఫలితాలు ఇలా...

- ఉదయం జరిగిన రెండో క్వార్టర్ ఫైనల్స్‌లో మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల(సత్తుపల్లి) – బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల(ఖమ్మం) జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బొమ్మ కళాశాల జట్టు 67 పరుగులు చేసింది. ఈ జట్టులో మహేష్ 24, ఉదయ్ 16 పరుగులు చేశారు. ఆతర్వాత మదర్ థెరిస్సా జట్టు 68 పరుగులు చేయగా సెమీస్‌కు ప్రవేశించింది. ఈ జట్టులో కేశవ్ మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 36 పరుగులు, ప్రవీణ్ 14 పరుగులు చేశాడు.
- ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల(ఖమ్మం) – వికాస్ డిగ్రీ కళాశాల(ఖమ్మం) జట్ల నడుమ మ్యాచ్‌లో బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ జట్టు 132 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ జట్టులో విశాల్ యాదవ్ 8ఫోర్లు, రెండు సిక్సర్లతో 53 పరుగులు, బన్నీ 5ఫోర్లు, 5 సిక్స్‌లతో 64 రన్స్ చేయడం విశేషం. ఆతర్వాత బ్యాటింగ్ చేసిన వికాస్ డిగ్రీ కళాశాల జట్టు కేవలం 46 పరుగులు చేయడంతో ఓటమి పాలైంది.
- కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాల(ఖమ్మం) – విజయ ఇంజనీరింగ్ కళాశాల(కొణిజర్ల) జట్ల మధ్య మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కవిత కాలేజీ జట్టు ఓవర్లలో 85 పరుగులు చేయగా, ఫరీద్ మూడు సిక్స్‌లు, నాలుగు ఫోర్లతో 46 పరుగులు, నాగుల్‌మీరా 16 పరుగులు చేశారు. ఆతర్వాత బ్యాటింగ్‌కు దిగిన విజయ ఇంజనీరింగ్ కళాశాల జట్టు 55 పరుగులే చేయగలిగింది. ఈ జట్టులో భాను రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 30 పరుగులు చేశాడు.



ఫైనల్‌కు చేరిన కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల జట్టు



క్వార్టర్ ఫైనల్స్‌లో హాఫ్ సెంచరీలు చేసిన ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ బ్యాట్స్‌మెన్లు విశాల్, బన్నీ

SUDHAKAR
PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY
Regional Sponser

ఫరీద్.. హ్యాట్రిక్



క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లో కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాల జట్టు ఆల్ రౌండర్ ఫరీద్ విజయ ఇంజనీరింగ్ కళాశాలపై వరుసగా మూడు వికెట్లు తీసుకుని హ్యాట్రిక్ సాధించాడు. అంతేకాక మరో వికెట్ కూడా తీసుకున్నాడు. ఇక బ్యాటింగ్‌లోనూ నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 46 పరుగుల వ్యక్తిగత స్కోరు సాధించాడు. ఈసందర్భంగా ఫరీద్ మాట్లాడుతూ ఇప్పటికే యూనివర్సిటీ జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపిక కాగా, కేయూ జట్టులో స్థానం సాధించడమే తన లక్ష్యమని తెలిపాడు.

జాతరకు ముస్తాబు..



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, జాతర నిర్వాహకులు

- 5 నుంచి లింగమంతుల స్వామి ఉత్సవాలు
- ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



ముస్తాబవుతున్న లింగమంతుల స్వామి ఆలయం

అశ్వాపురం: అశ్వాపురం, మణుగూరు మండలాల సరిహద్దులో ఉన్న రేగులగండి గుట్ట లింగమంతుల స్వామి జాతరకు సిద్ధమవుతోంది. ఈ నెల 5 నుంచి మూడు రోజులపాటు శ్రీ భవానీ లింగమంతుల స్వామి జాతర జరగనుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే రేగులగండిలో జరిగే స్వామివారి జాతరకు ప్రత్యేకత ఉంది. జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు లంకెల రమేష్, కమిటీ బాధ్యులు, అశ్వాపురం, మణుగూరు మండలాల యాదవ కుల పెద్దలు, యాదవ సంఘం కమిటీ ఆధ్వర్యంలో గుట్టపై లింగమంతుల స్వామి ఆలయం వద్ద ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. 1982లో రేగులగండి చెరువు పక్కన గుట్టపై లింమంతుల స్వామి వెలిశాడని, అప్పటి నుంచి గుట్టపై లింగమంతుని ఆలయం నిర్మించి జాతర నిర్వహిస్తున్నట్లు యాదవ కుల పెద్దలు చెబుతున్నారు. అప్పటి నుంచి రెండేళ్లకోసారి జాతర నిర్వహిస్తుండగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా యాదవులు అధిక సంఖ్యలో హాజరవుతూ మొక్కులు తీర్చుకుంటారు.

మూడు రోజులపాటు ఉత్సవాలు..

ఈ నెల 5 నుంచి మూడు రోజుల పాటు శ్రీ భవాని లింగమంతులస్వామి జాతర నిర్వహించనున్నారు. ఈ నెల 5న ఆదివారం సాయంత్రం నుంచి రేగులగండి గుట్టపై భక్తుల సందడి ప్రారంభం అవుతుంది. జాతరలో భాగంగా ఆదివారం సాయంత్రం 4 గంటలకు జగ్గారం గ్రామం నుంచి శివభవాని రథాలలో యాదవులు పెద్ద సంఖ్యలో రేగులగండి చేరుకుంటారు. ఈ నెల 6న సోమవారం ఉదయం 5 గంటలకు బోనాల ఉత్సవంతో జాతర ప్రారంభమవుతుంది. బోనాల అనంతరం ఉదయం 9.30 గంటలకు శ్రీ భవాని, లింగమంతుల స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నెల 7న మంగళవారం చంద్రపట్నం, పాడువు గొర్రె, వరద పాశంతో లింగమంతుని జాతర ముగుస్తుంది. జాతరకు సంబంధించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ బాధ్యులు, యాదవ సంఘం నాయకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. జాతరలో భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించాలని జాతర నిర్వహణ కమిటీ, యాదవ సంఘం నాయకులు సింగరేణి జీఎం వెంకటేశ్వరరెడ్డిని, ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావును కోరగా వారు సానుకూలంగా స్పందించి ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జాతర విజయవంతానికి సహకారం అందిస్తామని తెలిపారు. సింగరేణి అధికారులతో మాట్లాడి విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

'కూలీ రేట్ల పెంపునకు పోరాడాలి'

చర్ల: కూలీరేట్ల పెంపునకు, స్త్రీ పురుషులకు సమాన వేతనాల కోసం పోరాడాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. గురువారం మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ పేరిట మండలంలోని ఆర్ కొత్తగూడెం-సత్యనారాయణపురం గ్రామ శివారు ప్రాంతాల్లో వాల్‌పోస్టర్లు వెలిశాయి. ట్రాక్టర్ డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా చూడాలని, దూరప్రాంతాల నుంచి వచ్చే కూలీలకు యజమానులే రవాణా సౌకర్యాలు కల్పించాలని వాల్‌పోస్టర్లలో పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

జూలూరుపాడు: యువతి అదృశ్యంపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ పోటు గణేష్ కథనం ప్రకారం.. భేతాళపాడు గ్రామానికి చెందిన ఓ యువతి బుధవారం రాత్రి తల్లిదండ్రులు భోజనం చేసి నిద్రపోతున్న సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలి

ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్



కొర్సా స్వప్నను సన్మానిస్తున్న ఏపీఓ తదితరులు

భద్రాచలం: విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ సూచించారు. రామవరం(కొత్తగూడెం)లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కొర్సా స్వప్న 12 వేల అడుగులు ఉన్న హెచ్‌ఎంఐ శిఖరాన్ని అధిరోహించి బంగారు పతకం సాధించింది. గత నెల 6 నుంచి 20 రోజులపాటు ప్రయాణించి డార్జిలింగ్‌లోని హిమాలయ మౌంట్ ఇనిస్టిట్యూట్ తరఫున ఈ సాహసయాత్ర చేపట్టింది. ఈ సందర్భంగా గురువారం స్వప్నను ఏపీఓ తన చాంబర్‌లో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఈఎంఆర్ఎస్ పాఠశాలల నుంచి 33 మంది విద్యార్థినులు శిఖరాన్ని అధిరోహించేందుకు వెళ్లి ఐదు బంగారం, నాలుగు వెండి, కంచు పతకాలను సాధించారని ప్రశంసించారు. దుమ్ముగూడెం మండలం ఆర్లగూడెం గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన బాలిక స్వప్న బంగారు పతకం సాధించటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈమెను మిగతా విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ గౌతమి, పీఈటీ హేమను కూడా ప్రత్యేకంగా అభినందించారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి



మహిళ మృతదేహం

పాల్వంచరూరల్: అనుమానాస్పదస్థితిలో ఆదివాసీ మహిళ మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఉల్వనూరు గ్రామపంచాయతీ పెద్దకలస గ్రామానికి చెందిన బాడిస జోగమ్మ(42) గురువారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. జోగమ్మ బుధవారం రాత్రి భర్త సురేష్‌తో గొడవ పడింది. తెల్లవారుజామున శవమై కన్పించింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. భర్త కొట్టడం వల్లే మృతి చెందిందా ? లేక వేరే కారణాల వల్ల మృతి చెందిందా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

16 నెలలు గడిచినా ఆచూకీ లేదు



తప్పిపోయిన రాజేష్

సుజాతనగర్: మండలంలోని సీతంపేట బంజర గ్రామానికి చెందిన 17 ఏళ్ల బానోత్ రాజేష్ తప్పిపోయి 16 నెలలు గడుస్తున్నా ఆచూకీ దొరకలేదు. గ్రామానికి చెందిన బానోత్ ప్రతాప్, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు రాజేశ్ 9వ తరగతి చదువుతున్నాడు. తనకు సెల్‌ఫోన్ కావాలని అడగ్గా ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కొనివ్వలేనంటూ తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన రాజేష్ 2021, సెప్టెంబర్‌లో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా బాలుడి ఆచూకీ లభించలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైంది. అప్పటి నుంచి పలు ప్రాంతాల్లో వెతుకుతున్నా బాలుని ఆచూకీ మాత్రం లభించడంలేదు. ఈ ఘటనపై ఎస్సై పి.తిరుపతిరావును వివరణ కోరగా.. బాలుని కోసం వెతుకుతున్నామని, వివరాలు తెలిస్తే 90528 14843 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉప్పొంగిన భక్తిభావం



దుమ్ముగూడెం: సమ్మక్క తల్లిని ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆదివాసీలు

భక్తజన సందోహం నడుమ గద్దెకు చేరిన సమ్మక్క



చర్ల: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చర్ల: చినమేడారంగా ప్రసిద్ధిగాంచిన ఎదిరగుట్టల సమ్మక్క సారలమ్మ జాతరలో మూడో రోజు గురువారం సమ్మక్క తల్లి గద్దెకు చేరింది. ఆలయ పూజారులు గుండంతోగు గుట్టల నుంచి మేళతాళాలు, డప్పువాయిద్యాలు, గిరిజన సంప్రదాయ నృత్యాల నడుమ అమ్మవారిని గద్దెకు తోడ్కొని వచ్చారు. ఈ క్రమంలో అబ్బరాశిబండల ప్రాంతం వద్ద ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మవారిని గద్దెలపై ప్రతిష్ఠించగా సమ్మక్క సారలమ్మలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రంతోపాటు ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది.

ఆకట్టుకున్న ఇలవేల్పుల సమ్మేళనం

కరకగూడెం: చిరుమల్ల గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతర మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా సాగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు నిర్వహించిన 126 గట్ల ఇలవేల్పుల సమ్మేళనం ఆకట్టుకున్నది. వివిధ ప్రాంతాల నుంచి 11వ శతాబ్దం నాటి 24 భరాలు తీసుకొచ్చి ఆదివాసీ సంప్రదాయాలతో పూజలు జరిపారు. వనం నుంచి సమ్మక్క, సారలమ్మలను తీసుకొచ్చి గద్దెలపై కొలువుదీర్చారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి భారీగా వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించారు. గురువారం రాత్రి పగిడిద్ద రాజుతో సమ్మక్కకు అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

మొక్కులు చెల్లించుకున్న మాజీ ఎంపీ పొంగులేటి

ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి జాతరను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. రూ.లక్ష జాతర నిర్వహణ కమిటీకి విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చందా లింగయ్య దొర, పాయం వెంకటేశ్వర్లు, భద్రాద్రి జిల్లా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



కరకగూడెం: పూనకాలతో ఊగిపోతున్న భక్తులు



కరకగూడెం: విరాళం అందిస్తున్న పొంగులేటి, పాయం తదితరులు

వనం నుంచి జనంలోకి..

దుమ్ముగూడెం: మినీ మేడారంగా ప్రసిద్ధిగాంచిన మారాయిగూడెం శ్రీసమ్మక్క-సారలమ్మ జాతరలో మూడో రోజు సమ్మక్క తల్లి గద్దెలపై కొలువుదీరారు. ఆదివాసీలు వనదేవతను జయజయ ధ్వానాల నడుమ మేళతాళాలు, డప్పువాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలతో తోడ్కొని వచ్చారు. సాయంత్రం 4 గంటలకు అమ్మవారు గద్దెకు చేరడంతో నిండు జాతర ప్రారంభమైంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌పాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.

ఇల్లు దగ్ధం



దగ్ధమవుతున్న ఇల్లు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల గ్రామ పంచాయతీ సీతానగరం గ్రామం తెల్లంవారి గుంపునకు చెందిన శ్యామల వెంకటి ఇల్లు విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో ఇల్లు, సామగ్రి కాలి బూడిదయ్యాయి. సర్పంచ్ తెల్లం వరలక్ష్మి పంచాయతీ ట్యాంకర్ తెప్పించి నీళ్లు చల్లి మంటలను ఆర్పివేయించారు. దీంతో పక్క ఇళ్లకు ప్రమాదం తప్పింది.

చెత్తకు నిప్పంటుకుని ఎగిసిన మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పాల్వంచ: పట్టణంలోని బీసీఎం రోడ్‌లో సంజయ్ నగర్ వద్ద ఉన్న జెన్‌కో స్థలంలో స్థానికులు పడవేసిన చెత్తకు గురువారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగలు రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సమాచారం అందుకున్న కేటీపీఎస్ అగ్నిమాపక సిబ్బంది నాలుగు ఫైర్ ఇంజన్లతో అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

క్లుప్తంగా...

నెల్లూరు రూరల్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆదాల



సాక్షి, అమరావతి: నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని పార్టీ అధ్యక్షుడు, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియమించారని ఆ పార్టీ ప్రధాన కార్య దర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డే పోటీ చేస్తారని ప్రకటించారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌తో సజ్జల రామ కృష్ణారెడ్డి, ప్రాంతీయ సమన్వయకర్త బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు సమావేశమ య్యారు. అనంతరం సజ్జల మీడియాతో మాట్లాడారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి 2024 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించిన ఆడియో ఇటీవల సర్క్యులేట్ అయ్యిందని గుర్తు చేశారు. టీడీపీలోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నాక కోటంరెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఖాళీ అయిన నెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త స్థానాన్ని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డితో సీఎం వైఎస్ జగన్ భర్తీ చేశారని వివరించారు. బాలి నేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూ రల్ నియోజకవర్గంలో ఇకపై ఆదాల ద్వారానే అన్ని కార్యక్రమాలు జరుగుతాయని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆదాల విజయం నల్లేరుపై నడకేనని ధీమా వ్యక్తం చేశారు.

హుండీ ఆదాయంలో రికార్డుల మోత

ఆపద మొక్కులవాడి ఆదాయం 11 నెలల్లోనే రూ.1,414.21 కోట్లు

తిరుమల: ఆపద మొక్కులవాడికి సాధారణంగా మే, జూన్ నెలల్లో మాత్రమే హుండీ ద్వారా లభించే ఆదాయం నెలకు రూ.100 కోట్లు దాటేది. మిగిలిన నెలల్లో నెలకు రూ.100 కోట్లలోపే ఉండేది. ప్రస్తుతం శ్రీవారికి నిత్యం రూ.4 కోట్లకు పైగా హుండీ ఆదాయం లభిస్తోంది. టీటీడీ చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా గత ఏడాది మార్చి నుంచి ప్రతినెలా హుండీ ఆదాయం రూ.100 కోట్లు దాటుతోంది. గడచిన 11 నెలల్లో రూ.1,414.21 కోట్లు రాగా.. ఈ ఏడాది రూ.1,500 కోట్ల మార్కును దాటిపోనుంది.



తరలిపోతున్న తెల్ల బంగారం

పత్తి పంటకు ఆదిలాబాద్ జిల్లాలో సరైన మద్దతు ధర లేక మహారాష్ట్రకు తరలిపోతోంది. జిల్లాలో గురువారం పత్తి క్వింటాకు సీసీఐ ధర రూ.7,700 పలుకగా, ప్రైవేటు వ్యాపారులు రూ.7710కు కొనుగోలు చేశారు. జైనథ్ మండలం మాండగడ గ్రామం వద్ద పత్తిని వాహనంలో తరలిస్తుండగా కనిపించిన దృశ్యమిదీ.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ట్యాపింగ్ కాదది.. రికార్డింగే

జరగని ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లుగా చిత్రీకరిస్తూ చంద్రబాబు కుట్ర

జాతీయ సమస్యగా దానిపై పోరాటం చేసే స్థాయికి దిగజారిన వైనం

- ఈ కుట్రలో కోటంరెడ్డి పాత్రధారి
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- వైఎస్సార్‌సీపీ లేకుంటే ఎమ్మెల్యే అయ్యేవాడివా?
- ఏపీ మంత్రి పెద్దిరెడ్డి మండిపాటు
- ఇది నమ్మకద్రోహం
- మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం

సాక్షి, అమరావతి : 'ఏపీలో రాజకీయం చేయడానికి ఏ సమస్యా లేకపోవడంతో జరగనే జరగని ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు చిత్రీకరించి.. దానిని జాతీయ సమస్యగా సృష్టించి, పోరాటం చేసే స్థాయికి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు దిగజారారు. ఈ కుట్రలో కోటంరెడ్డి పాత్రధారి. ఇందులో భాగంగా కోటంరెడ్డి ప్రభుత్వంపై బురద చల్లి పార్టీ వీడాలనుకోవడం దారుణం. ఇంతకూ రికార్డ్ చేసింది కోటంరెడ్డి మిత్రుడే' అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, విద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మండిపడ్డారు. గురువారం వారు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

టీడీపీలో చేరే వారు బావిలో దూకినట్లే

ఇష్టం లేనివారు టీడీపీలోకి వెళ్లాలనుకుంటే వెళ్లొచ్చు. కానీ ప్రభుత్వంపై, వైఎస్సార్‌సీపీపై బురదజల్లాలనుకోవడం సమంజసం కాదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని స్థాపించకపోతే నీలాంటి వాళ్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యేవారా? కోటంరెడ్డి ఆరోపిస్తున్నట్లుగా అది ఫోన్ ట్యాపింగ్ కానే కాదు. ఆయన మిత్రుడే రికార్డ్ చేశారన్న విషయం కోటంరెడ్డికి కూడా తెలుసు. ఇదంతా చంద్రబాబు కుట్ర. ఇలాంటి కుట్రలు, కుతంత్రాలకు సీఎం వైఎస్ జగన్ భయపడరు. టీడీపీలో చేరే ఎమ్మెల్యేలు బావిలో దూకినట్టే.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి

టీడీపీ రాజకీయ లబ్ధి కోసమే..



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఫోన్ సంభాషణను ఆయన మిత్రుడే రికార్డింగ్ చేసి.. అందరికీ పంపారు. బయట సర్క్యులేట్ అవుతున్న ఆ ఆడియో క్లిప్‌ను ఇంటెలిజెన్స్ అధికారి కోటంరెడ్డికి పంపి, సరి చూసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ తరఫున రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో సమావేశమయ్యాక.. 2024లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని చెప్పిన మాటల ఆడియో కూడా సర్క్యులేట్ అవుతోంది. చంద్రబాబుతోనూ లోకేశ్‌తోనూ కోటంరెడ్డి ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారని టీడీపీ నేతలే చెబుతున్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసి ఉంటే.. చంద్రబాబుతో కోటంరెడ్డి సంప్రదింపులు జరుపుతున్నట్లుగా మేం అప్పుడే గుర్తించేవాళ్లం కాదా? టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావు ద్వారా చంద్రబాబు.. మా ఫోన్లను ట్యాపింగ్ చేశారని.. దానిపై న్యాయస్థానంలో కేసు కూడా వేశాం. వాళ్లలాగే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్లు రాజకీయ లబ్ధి కోసం టీడీపీ కుట్ర పూరితంగా చిత్రీకరిస్తోంది.


– సజ్జల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు

డిసెంబర్ 25న బాబును కలిశారు



'నీ ఫోన్ సంభాషణను నీ మిత్రుడు రామశివారెడ్డి రికార్డ్ చేసి, అందరికీ పంపారు. అది బయట సర్క్యులేట్ అవుతుంటే.. ఇంటెలిజెన్స్ అధికారి దాన్ని నీకు వాట్సాప్‌లో పంపి.. సరి చూసుకోవాలని సూచించడంలో తప్పేముంది? ఇది వాస్తవం కాదంటే.. నీ ఫోన్‌కు సంబంధించి గత ఆర్నెల్ల వాట్సాప్ డేటాను బహిర్గతం చేయగలవా? కోటంరెడ్డిని సీఎం జగన్ ఎంతగానో నమ్మితే.. ఇలా నమ్మక ద్రోహానికి పాల్పడటం తగదు. 'డిసెంబర్ 25న బ్లూ కలర్ బెంజ్ కారులో చంద్రబాబు ఇంటికి కోటంరెడ్డి వచ్చి.. రెండు గంటలపాటు మాట్లాడి వెళ్లారు. ఇదివరకట్లాగే నారాయణతో సంబంధాలు కొనసాగించాలని బాబు చెప్పారు. లోకేశ్‌తో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారు. పాదయాత్రకు ముందు లోకేశ్ సలహాలు కూడా అడిగారు. కోటంరెడ్డి ఆస్పత్రిలో ఉన్నప్పుడు లోకేశ్ ఫోన్ ద్వారా పరామర్శించారు' అని టీడీపీ నేతలు, కోటంరెడ్డి పక్కనున్న వారే చెబుతున్నారు.

– పేర్ని నాని, మాజీ మంత్రి



కన్హా శాంతివనంలో గురూజీ కమ్లేశ్ పటేల్‌తో హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్, న్యాయమూర్తుల బృందం

దేశప్రగతికి ఆధ్యాత్మికత మూలాధారం

లాలాజీ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో కేంద్రమంత్రి దేవుసింగ్ చౌహాన్

నందిగామ: సమాజంలోని ప్రతివ్యక్తి ఆధ్యాత్మికతను అలవర్చుకున్నట్లయితే అందమైన ప్రపంచం తయారవుతుందని, దేశప్రగతికి ఆధ్యాత్మికత మూలాధారమని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి దేవుసింగ్ జేసింగ్ భాయ్ చౌహాన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామలోని కన్హా శాంతి వనంలో జరిగిన శ్రీ రామచంద్ర మిషన్ వ్యవస్థాపకుడు లాలాజీ మహరాజ్ 150వ జయంతి ఉత్సవంలో ఆయన వర్చువల్ విధానంలో మాట్లాడారు. ప్రతి వ్యక్తి హార్ట్‌ఫుల్‌నెస్ పద్ధతి ద్వారా ధ్యానం చేసినట్లయితే ఆత్మశుద్ధి అవుతుందన్నారు. ప్రస్తుత గురూజీ కమ్లేశ్ పటేల్‌కు పద్మభూషణ్ అవార్డు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. గురూజీ కమ్లేశ్ పటేల్ మాట్లాడుతూ ప్రాణాహుతి, హార్ట్‌ఫుల్‌నెస్ ద్వారా ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ప్రకాశ్, సర్కిల్ అధికారి రేవా ఆధ్వర్యంలో లాలాజీ స్మారక పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రముఖ సంగీత కళాకారుడు హరిప్రసాద్ చౌరాసియా సంగీత విభావరి అలరించింది. ఉత్సవాలకు హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తోపాటు జస్టిస్ రాధారాణి, జస్టిస్ ఎస్.నంద, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ భీమపాక నగేశ్, జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ శ్రీసుధ, జస్టిస్ నాగార్జున్, జస్టిస్ సురేందర్, జస్టిస్ సుధీర్‌కుమార్‌లు పాల్గొని ధ్యానం చేశారు.

దేశవ్యాప్తంగా ఏపీ 'పెట్టుబడుల' సదస్సులు

- ముంబై, అహ్మదాబాద్, బెంగళూరు, కోల్‌కతా, త్రివేండ్రం, చెన్నై, హైదరాబాద్‌లో నిర్వహణ

సాక్షి, అమరావతి: పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా విశాఖలో మార్చి నెలలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సును విజయవంతం చేయడమే లక్ష్యంగా.. దేశవ్యాప్తంగా పెట్టుబడుల సన్నాహక సదస్సులను ఏపీ ప్రభుత్వం నిర్వహించబోతోంది. ఫిబ్రవరి 10 నుంచి 24 వరకు దేశంలోని 7 ప్రధాన నగరాల్లో రోడ్‌షోలు నిర్వహించేందుకు ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రణాళికలు రూపొందించింది. సీఎం జగన్ ఇటీవల ఢిల్లీలో ప్రారంభించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సు విజయవంతమవ్వడంతో.. అదే స్ఫూర్తితో ఈ రోడ్‌షోలను కూడా నిర్వహించబోతోంది. ఫిబ్రవరి 10న త్రివేండ్రం, కోల్‌కతా, 14న బెంగళూరులో, 17న చెన్నై, అహ్మదాబాద్, 21న ముంబై, 24వ తేదీన హైదరాబాద్‌లో ఈ రోడ్‌షోలు నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశమున్న వనరులు, ప్రయోజనాలను వివరించడంతో పాటు ప్రధానంగా 13 రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఈ రోడ్ షోలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ఇప్పటికే ఆసక్తిని వ్యక్తం చేశాయి. మార్చి 3–4 తేదీల్లో విశాఖ వేదికగా జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో ఆ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతూ.. వాస్తవ ఒప్పందాలు చేసుకుంటాయని పరిశ్రమల శాఖ అధికారులు వెల్లడించారు.

మాజీ సీఎస్ సోమేశ్‌కు బెయిలబుల్ వారెంట్

కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు జారీ



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో ఒక ప్లాట్‌కు సంబంధించిన వ్యవహారంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కోర్టుకు హాజరుకావాలని పలుమార్లు ఆదేశించినా.. రాకపోవడంతో ఈ మేరకు చర్యలు తీసుకుంది. హౌసింగ్ సొసైటీ వ్యవహారంలో కోర్టు తీర్పు అమలు చేయనందుకు సోమేశ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ విశాఖపట్నంకు చెందిన జయరావు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మమ్మినేని సుధీర్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. మాజీ సీఎస్‌కు బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు.

జిల్లా వార్తలు


కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన ఎంపీ రవిచంద్ర



గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో గురువారం రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఖమ్మం మీదుగా వెళ్లే నాగపూర్ – అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్‌ను ఖమ్మం కలెక్టరేట్ వద్ద మార్చాలని కోరారు. ప్రతిపాదిత అలైన్‌మెంట్ సమీకృత కలెక్టరేట్ మధ్య నుంచి వెళ్తుండడంతో ఇబ్బంది ఏర్పడనున్న దృష్ట్యా కలెక్టరేట్ వెనుక నుంచి వెళ్లేలా సవరించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే హైవేపై ఖమ్మం, విజయవాడ మార్గం నుంచి వచ్చే వాహనాలు సూర్యాపేట వద్ద కలిసే మార్గంలో అండర్ పాస్ నిర్మించాలని, జాతీయ రహదారి 65పై చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట వద్ద కూడా అండర్ పాస్ మంజూరు చేయాలని కోరగా, కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించారని ఎంపీ ఓ ప్రకటనలో వెల్లడించారు.

పైనంపల్లి సొసైటీని సందర్శించిన నాబార్డ్ జీఎం



గోదాంను పరిశీలిస్తున్న నాబార్డు జీఎం వెంకటేష్ తదితరులు

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని నాబార్డు జీఎం వెంకటేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సొసైటీ ఆధ్వర్యాన నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల గోదాం, సూపర్‌మార్కెట్ ను పరిశీలించాక రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం రైతులకు అందిస్తున్న సేవలపై ఆరా తీసిన ఆయన సొసైటీ సేవలను ప్రశంసించారు. నాబార్డు డీడీఎం సుజిత్, డీసీసీబీ బ్రాంచి మేనేజర్ ఇందు, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావుతో పాటు కలకుంట్ల శ్రీను, చిట్లా భాస్కర్‌రెడ్డి, వేనేపల్లి నాగేశ్వరరావు, బాలాజీ, చల్లగుండ్ల వెంకట్రామయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంకు జాతీయ కీర్తి

- స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ త్రీస్టార్ కేటగిరీలో దేశంలోనే ఫస్ట్
- ఐదో స్థానంతో సత్తా చాటిన భద్రాద్రి జిల్లా
- పలు అంశాల్లో ఆదర్శంగా నిలిచిన గ్రామపంచాయతీలు
- ఫోర్త్ స్టార్‌లోకి ప్రవేశించిన ఖమ్మం జిల్లా



ఎస్‌బీఎం ఆధ్వర్యాన నిర్మించిన మరుగుదొడ్డి



మరుగుదొడ్డి వినియోగంపై వేసిన వాల్‌పెయింట్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కీర్తిపతాక జాతీయ స్థాయిలో రెపరెపలాడింది. స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ అమలుచేస్తున్న పలు కార్యక్రమాల్లో జిల్లాలోని గ్రామపంచాయతీలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. కేంద్రప్రభుత్వం తాజాగా ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ ర్యాంకింగ్‌లో జిల్లా దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఓడీఎఫ్ ప్లస్ విభాగంలో త్రీ స్టార్ కేటగిరిలో జిల్లాకు ఈ ఘనత దక్కింది. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగం, తడిచెత్తతో సేంద్రియ ఎరువు తయారీ, పొడి చెత్త అమ్మకం ద్వారా గ్రామపంచాయతీలకు ఆదాయం, మురుగునీటి నిర్మూలన తదితర అంశాలను ప్రామాణికంగా తీసుకుని కేంద్రప్రభుత్వం ర్యాంకులు ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా '5 స్టార్' విభాగంలో అగ్రస్థానంలో నిలిచి జాతీయస్థాయి అవార్డు సాధించేందుకు జిల్లాకు అవకాశాలు ఉన్నాయి.

ఓడీఎఫ్‌పై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని ప్రతీ ఇంట్లో మరుగుదొడ్డి ఉండేలా జిల్లా అధికారులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ దిశగా ఐదేళ్ల నుంచి కృషి చేస్తూ వచ్చారు. గృహాలతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్ల వద్ద మరుగుదొడ్లను నిర్మించి బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించాలనే కృతనిశ్చయంతో కృషి చేశారు. గృహ యజమానులకు అవగాహన కల్పించి నిర్మాణాలను పూర్తి చేయించగా.. ఖమ్మంను ఓడీఎఫ్ జిల్లాగా, 561 గ్రామపంచాయతీలను ఓడీఎఫ్ ప్లస్‌గా ప్రకటించారు. ఇంకా కంపోస్ట్ షెడ్ల వినియోగం, అన్ని గ్రామాల్లో మురుగునీటి నిర్వహణ, పరిశుభ్రంగా తీర్చిదిద్దడం, పారిశుద్ధ్యానికి సంబంధించి వాల్ పెయింటింగ్స్ వేయించడంతో త్రీస్టార్ కేటగిరిలో జిల్లాకు మొదటిస్థానం లభించింది.

సమష్టి కృషితో..

ఓడీఎఫ్ గ్రామాలుగా తీర్చిదిద్దడంపై అధికారులు మొదటి నుంచి విస్తృత ప్రచారం నిర్వహించారు. బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత గ్రామాలను తయారు చేయడమే లక్ష్యంగా కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఆర్‌డీఏ అధికారులు, ఎస్‌బీఎం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ కార్మికులు ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యదర్శులు గ్రామాల్లో చేపట్టిన పనులను ఎప్పటికప్పుడు నివేదికల రూపంలో ఎస్‌బీఎం సిబ్బందికి అందించడం, ఆపై అదనపు కలెక్టర్, డీఆర్డీఓ సమక్షాన కేంద్రప్రభుత్వ వెబ్‌సైట్లలో పొందుపరుస్తూ కేంద్ర జలశక్తి శాఖ దృష్టికి తీసుకెళ్లారు. దీంతోపాటు కేంద్ర బృందాలు ఎంపిక చేసుకుని పరిశీలించిన జీపీల్లో.. జిల్లా అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా పనులు జరిగినట్లు తేలడంతో జిల్లా దేశంలోనే మొదటి స్థానం సాధించేందుకు దోహదపడింది.

జాతీయ అవార్డే లక్ష్యం..

ప్రస్తుతం జిల్లా త్రీ స్టార్ విభాగంలో పోటీ పడి మొదటి స్థానం సాధించి.. 4 స్టార్‌లోకి ప్రవేశించింది. జిల్లాలో మొత్తం 589 గ్రామపంచాయతీలు ఉండగా.. వీటిలో 561 జీపీలను ఓడీఎఫ్ ప్లస్‌గా ప్రకటించారు. ఆయా జీపీల్లో 65,801 మరుగుదొడ్లు,589 సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. ఈ షెడ్ల ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేసి అమ్మడంతో రూ.14.96 లక్షల ఆదాయం సమకూరింది. ఓడీఎఫ్ ప్లస్‌గా ఎంపికైన జీపీల్లో 147 జీపీలను జిల్లాస్థాయి బృందాలు తనిఖీ చేయగా, జిల్లాకు త్రీస్టార్ విభాగంలో మొదటి స్థానం దక్కింది. ఇక 561 గ్రామపంచాయతీల్లో 147పోగా మిగిలిన 414 గ్రామపంచాయతీల్లో కూడా పరిశీలించాక, 28 గ్రామపంచాయతీలనూ ఓడీఎఫ్ ప్లస్‌గా ప్రకటించి తనిఖీ చేస్తే ఈ ఏడాదికి గాను స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు దక్కనుంది.

మంత్రి పువ్వాడ అభినందనలు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశంలోనే ఖమ్మం మొదటిస్థానం సాధించడంపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులను అభినందించారు. కేంద్ర జలశక్తి శాఖ దేశంలో 44 పట్టణాలకు త్రీస్టార్ రేటింగ్ ఇవ్వగా.. అందులో 187.35 శాతం మార్కులతో ఖమ్మం జిల్లా దేశంలోనే మొదటి స్థానం, 122.57 మార్కులతో భద్రాద్రి జిల్లా ఐదో స్థానంలో నిలవడం గర్వకారణమని తెలిపారు.

సాగర్ జలాల కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

- వైరా – జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో
- ఎన్నెస్పీ కార్యాలయంలో అధికారుల నిర్బంధం



బోనకల్ బీబీసీపై రాస్తారోకో చేస్తున్న రైతులు

బోనకల్: ఖమ్మం జిల్లా బోనకల్ బ్రాంచ్ కెనాల్(బీబీసీ) పరిధిలోని చివరి ఆయకట్టుకు సాగర్ జలాలు అందక పంటలు ఎండిపోతున్నాయని మండలంలోని రైతులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. వారబందీ విధానంతో తమకు నీరందక మొక్కజొన్న పంట ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైరా – జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై చేపట్టిన రాస్తారోకోలో రైతులకు అఖిల పక్షం నాయకులతోపాటు అధికార పక్షం నాయకులు కూడా మద్దతు తెలపగా.. గంట పాటు ఇరువైపులా ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది.

600 క్యూసెక్కులేనా?

బీబీసీకి 1,376 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉన్నా కేవలం 600 క్యూసెక్కులే విడుదల చేస్తుండడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు వెల్లడించారు. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి పండించిన మొక్కజొన్న కళ్ల ముందే ఎండిపోతుంటే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. ఈమేరకు ఎన్నెస్పీ అధికారులు చేరుకుని ఉన్నతాధికారులను పిలిపించి మాట్లాడదామని సర్దిచెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. అయితే, కార్యాలయం వద్దకు వెళ్లాక ఉన్నతాధికారులు రాకపోవడంతో డీఈ శ్రీనివాసరావు, జేఈలు, సిబ్బందిని కార్యాలయంలో నిర్బంధించారు. దీంతో నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఈఈ రామకృష్ణ చేరుకోగా, నీరు విడుదల చేసి నాలుగు రోజులవుతున్నా నేటికి తమ పొలాలకు చేరలేదని రైతులు మండిపడ్డారు. మరో మూడు రోజులపాటు నీరు విడుదల చేస్తామనే హామీతో రైతులు ఆందోళన విరమించారు. బీఆర్ఎస్ సహా అఖిలపక్షం నాయకులు గాలి దుర్గారావు, దొండపాటి నాగేశ్వరరావు, కందుల పాపారావు, వేమూరి ప్రసాద్, చేబ్రోలు మల్లికార్జున్‌రావు, సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్‌రావు, పారా ప్రసాద్, కాకాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు లోక్ అదాలత్ ప్రారంభం

- బీమా కేసులో పరిహారం ఇప్పించిన జిల్లా జడ్జి శ్రీనివాసరావు
- ఆపై బ్యాంకు అధికారులతో సమీక్ష



లోక్ అదాలత్ అవార్డు అందజేస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు, పక్కన న్యాయమూర్తి జావేద్‌పాషా

ఖమ్మంలీగల్: ఈనెల 11న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి ముందస్తు కేసుల పరిష్కార ప్రక్రియ ప్రారంభమైంది. ఈమేరకు గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన పలు కేసులను విచారించారు. ఇందులో భాగంగా రోడ్డు ప్రమాద కేసులో బాధిత కుటుంబానికి పరిహారం ఇప్పిస్తూ అవార్డు జారీ చేశారు. రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతిచెందగా కుటుంబ సభ్యులు ఫ్యూచర్ జనరల్ బీమా కంపెనీ నుంచి పరిహారం కోసం కేసు దాఖలు చేశారు. ఈ వివాదాన్ని జిల్లా జడ్జి పరిష్కరించగా.. బీమా కంపెనీ అధికారులు బాధిత కుటుంబానికి రూ.18 లక్షలు చెల్లించడానికి అంగీకరించారు.

బ్యాంక్ కేసుల లోక్ అదాలత్

జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా బ్యాంకులు దాఖలు చేసిన రుణ వసూలు కేసులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు సూచించారు. బ్యాంకు అధికారులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులతో సమావేశమైన జిల్లా జడ్జి మాట్లాడుతూ రుణ వసూళ్ల నిమిత్తం దాఖలు చేసిన కేసుల్లో సాధ్యమైనంత తగ్గింపును ప్రకటించాలని తెలిపారు. దీంతో అధికారులు స్పందిస్తూ, కేసు ఆధారంగా బట్టి 50 నుంచి 75 శాతం వరకు తగ్గింపు ఇవ్వడమే కాకుండా వడ్డీ మొత్తాన్ని మాఫీ చేస్తామని ప్రకటించారు. ఈమేరకు కక్షిదారులు రాజీకి వస్తే వెంటనే లోక్ అదాలత్‌కు పంపాలని కోర్టులకు సూచించారు. న్యాయసేవాసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసు రాజీ చేసుకుంటే బ్యాంకులో తనఖా ఉన్న ధ్రువపత్రాలను వెంటనే తిరిగి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మువ్వా నాగేశ్వరరావు, స్వర్ణ రాంబాబుతో పాటు వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి న్యాయం..

వృద్ధాప్యంలో తల్లికి ఆసరాగా ఉండాల్సిన కొడుకు ఆమె ఇంటిని లాక్కుని వెళ్లగొట్టగా.. న్యాయ సేవా సంస్థ ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చి న్యాయం చేసింది. రఘునాథపాలెంకు చెందిన లింగబోయిన ముత్తమ్మ నుంచి ఆమె కుమారుడు రామకోటయ్య ఇల్లు లాక్కుని వెళ్లకొట్టాడని న్యాయ సేవా సంస్థను ఆశ్రయించగా, న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా వృద్ధురాలి కుమారుడికి నోటీసులు జారీ చేసి లోక్‌అదాలత్ ఎదుట హాజరుపరిచారు. ఈమేరకు వృద్ధాప్యంలో ఉన్న తల్లిని చూసుకోవాల్సిన బాధ్యతను వివరించగా కుమారుడు అంగీకరించడమే కాకుండా నెలకు రూ.1,500 ఇవ్వడానికి అంగీకరించాడు. అలాగే, ఇంట్లోని ఒక భాగాన్ని తల్లి కేటాయించగా, లోక్‌అదాలత్ అవార్డును ఆమెకు న్యాయమూర్తి అందించారు.

బొగ్గు ఉత్పత్తి పెంచండి

వీసీలో సింగరేణి సీఎండీ శ్రీధర్

సత్తుపల్లి/సత్తుపల్లి రూరల్: కొత్తగూడెం ఏరియాలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచి ఎక్కువ మొత్తంలో రవాణా చేసేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. హైదరాబాద్‌నుంచి గురువారం సింగరేణి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జనవరిలో గణనీయమైన ఉత్పత్తి సాధించడంపై అభినందించిన సీఎండీ.. రానున్న రెండు నెలలు కీలకమైనందున ప్రతిరోజు 2.50 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపు, రోజుకు 49,500 టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి జేవీఆర్ ఓసీ నుంచి వీసీకి హాజరైన కొత్తగూడెం జీఎం రమేశ్ మాట్లాడుతూ.. ఏరియాకు కేటాయించిన ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను చేరుకుంటామని తెలిపారు.

కొమ్మేపల్లి కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం..

అయ్యగారిపేటలోని కొమ్మేపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్ తెలిపారు. కాలనీలో గురువారం పర్యటించిన ఆయనకు స్థానికులు డ్రైయినేజీలు, రోడ్లు, వీధిలైట్ల సమస్యలను వివరించగా అన్నీ పరిష్కరిస్తామని, పాఠశాలలో బల్లలు సమకూరుస్తామని చెప్పారు. ఈకార్యక్రమాల్లో అధికారులు నారాయణరావు, సూర్యనారాయణ, ఎస్.వెంకటాచారి, ఎం.వీ.నర్సింహారావు, వై.రఘురాంరెడ్డి, సామ్యూల్ సుధాకర్, ఎం.రమేష్, రవీందర్, మోహన్, శేషశ్రీ, రమణారెడ్డి, దేవదాస్, విజయ్ సందీప్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భారత నెట్‌బాల్ జట్టు శిక్షణ శిబిరం

ఖమ్మం స్పోర్ట్స్: నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో భారత యూత్ నెట్‌బాల్ బాలికల జట్టుకు ఖమ్మంలో శిక్షణ శిబిరం ఏర్పాటుచేసినట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.ఫణికుమార్, దీప్తి తెలిపారు. ఖమ్మంలోని సెయింట్ జోసఫ్ హైస్కూల్‌లో ఈనెల 1న మొదలైన శిబిరం 13వ తేదీన ముగుస్తుందని పేర్కొన్నారు. ఇక్కడ శిక్షణ పొందే జట్టు కొరియాలో జూన్ 10నుంచి జరిగే 12వ ఆసియా యూత్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఇదే జట్టుకు రెండో విడత శిక్షణ హర్యానా రాష్ట్రం రోహతక్‌లో జరుగుతుందని వివరించారు.